

రూ.12 కోట్లతో

రహదారులు అభివృద్ధి

మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మంత్రి

ముత్తుకూరు మండల కేంద్రంలో ప్రధాన రహదారులను రూ 12 కోట్ల నిధులతో అభివద్ధి చేస్తున్నట్టు రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి కాకాణి గోవర్ధన రెడ్డి తెలిపారు. ఆదివారం ముత్తుకూరు మండల కేంద్రంలో 6వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రికి అశేష ప్రజలు విశేష స్వాగతం పలికారు. ప్రతి ఇంటికి వెళ్లి ఆయా కుటుంబాలతో మమేకమవుతూ, వారు పొందిన సంక్షేమ లబ్ధిని తెలిపే బుక్లెట్ ను అందిస్తూ వారింటి పెద్ద బిడ్డగా వారి సమస్యలు తెలుసుకున్నారు. ముత్తుకూరు మండల కేంద్రంలో కోటి రూపాయలు నిధులు వెచ్చించి నిర్మాణం చేసిన సిమెంట్ రోడ్డును మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మీడియాతో మాట్లాడుతూ ప్రతి కుటుంబాన్ని పలకరించి వారి సమస్యలను తెలుసుకుని, పరిష్కరించేందుకు ఏర్పాటుచేసిన వినూత్నమైన కార్యక్రమం గడపగడపకు మన ప్రభుత్వమని వివరించారు. అభివద్ధి కార్యక్రమాలకు గాను ప్రతి సచివాలయానికి అందజేసిన 20 లక్షల నిధులతో పాటు శాసనసభ్యునిగా కేటాయించిన నిధులతో నియోజకవర్గాన్ని అభివద్ధి చేస్తున్నామన్నారు. ముత్తుకూరు మండల కేంద్రంలో ప్రధాన రహదారిని రూ 12 కోట్ల రూపాయల నిధులతో అభివద్ధి చేస్తున్నామన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రోడ్డు విస్తరణ కార్యక్రమాన్ని చేస్తున్నామన్నారు. సర్వేపల్లి నియోజకవర్గం గ్రామాల్లోని రోడ్లను ఇప్పటికే సిమెంటు రోడ్లతో అభివద్ధి చేసామన్నారు. సాంకేతిక కారణాలతో నాన్ ఫిషర్ మాన్ ప్యాకేజీ అందని వారికి వెంటనే అందజేయుటకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. సుదీర్ఘంగా అపరిష్కృతంగా ఉన్నటువంటి సమస్యలను పరిష్కరించామన్నారు. ఇచ్చిన ప్రతి హామీని అమలుచేసి ధైర్యంగా ప్రజల ముందుకు వెళ్లగలుగుతున్నామన్నారు. పెద్ద ఎత్తున సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలనను మరలా కొనసాగించుటకు ప్రజలు సిద్ధమయ్యారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుగుణమ్మ, ఎంపిడిఓ ప్రత్యూష, తహసీల్దార్ మనోహర్ బాబు, వివిధ శాఖల మండల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బడ్జెట్లో వృత్తిదారులకు నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

మాట్లాడుతున్న గుంజి దయాకర్

రాష్ట్ర బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించి ఖర్చుచేయాలని చేతివృత్తుదారుల సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం నగరంలో సిఐటియు జిల్లా కార్యాలయంలో చేతివత్తదారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం రేకులకుంట అంకయ్య అధ్యక్షతన జరిగింది.. ఈ సమావేశానికి వడ్డెర వత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేతి వత్తుల నుండి వత్తుదారులను దూరం చేస్తూ కార్పొరేట్ శక్తులను ప్రోత్సహిస్తూ ప్రపంచీకరణ సరళీకరణ విధానాల వలన చేతివత్తులన్నీ ధ్వంసం అవుతున్నాయని కేంద్రంలో మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీ పథకాన్ని రాష్ట్రీయ వికాస్ పథకం బెడ్ పాలక్ బీమా యోజన పథకాలను రద్దు చేసిందన్నారు. బడ్జెట్లలో నిధులు కేకటాయింపులలో కోత విధిస్తున్నారన్నారు. రాష్ట్రంలో చేనేత, కల్లుగీత , గొర్రెల , మేకల పెంపకం దారులు కమ్మరి, మేదర , రజక ,వడ్డెర , మచ్చ వడ్రంగి, కంచర స్వర్ణ , శిల్ప శౌర ,కలంకారి పూసల ,బట్రాజులు, వాల్మీకి, బోయి వారు దాదాపు కోటి 70 లక్షల మంది వివిధ వత్తులపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 56 రకాల చేతివత్తదారులకు అభివద్ధి సంక్షేమము కార్పొరేషన్లను ఏర్పాటు చేసినట్లుగా గొప్పలు చెప్పుకుంటూ నిధులు విడుదల చేయకుండా విధి విధానాలు రూపొందించకుండా కేవలం కార్పొరేషన్ లకు చైర్మన్లు, డైరెక్టర్లను నియమించి వారికి రాజకీయ ఉపాధి కల్పించి వేతనాలు అలెవెన్సెస్ చెల్లిస్తూ బీసీ తరగతులను తీవ్రంగా మోసం చేసిందన్నారు. రాష్ట్ర బడ్జెట్లో కేటాయించిన నిధులను చేతి వత్తదారుల ప్రయోజనాల కల్పనకు ఉపయోగించడం లేదని తీవ్రంగా దుయ్యబడ్డాడు బీసీ సబ్ ప్లాన్ కి రూ 35 వేల కోట్ల రూపాయలు నిధులు కేటాయించి ఆ నిధులు కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇతర ప్రయోజనాల కోసం దారి మళ్లించి బీసీలకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు ప్రతి వత్తిదారుని కుటుంబ సంక్షేమం కోసం రూ 25 వేల రూపాయలు ఆర్థిక సహకారం అందించాలని, ప్రతి వృత్తిదారిని కుటుంబానికి నెలకు 200 యూనిట్ల కరెంటు ఉచితంగా అందించాలని, వత్తి నిర్వహణలో ప్రమాద వశాత్తు మరణించిన వత్తిదారుల కుటుంబానికి పది లక్షలు రూపాయలు ఎక్స్ గ్రేస్ యా ఇవ్వాలని, వత్తిదారుల ఫెడరేషన్ లకు కార్పొరేషన్లకు విధులు నిర్ణయించే నిధులు కేటాయించి ఖర్చు చేయాలని, కుల గణన సర్వే చేపట్టి జనాభా ప్రాతిపదికన వత్తిదారుల రక్షణ సంక్షేమం అభివద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. చేతి వత్తిదారులకు రాష్ట్ర బడ్జెట్లో కేటాయించిన నిధులు వత్తిదారుల అభివద్ధికి సంక్షేమానికి ఖర్చు చేయాలని వత్తిదారులకు సామాజిక రక్షణ చట్టం తీసుకురావాలని సబ్సిడీలతో కూడిన రుణాలు మంజూరు చేయాలని తదితర అంశాలపై ఆంధ్రప్రదేశ్ చేత వత్తిదారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 30 ఉదయం 10 గంటలకు విజయవాడ లో ఎం బి విజ్ఞాన కేంద్రం ఆడిటోరియం నందు జరుగు రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని చేతి వత్తిదారులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రజక వత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్ శ్రీనివాసులు క్షౌర వత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి జె సతీష్ గీత కార్మిక సంఘం జిల్లా నాయకులు వెంకయ్య వడ్డెర వత్తిదారుల సంఘం జిల్లా నాయకులు బాల వెంకటేశ్వర్లు చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు శుభ కుమార్ తదితరులు 20 మంది పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల్లో పరిశీలిస్తున్న ఎస్‌పి

ప్రశాంతంగా కానిస్టేబుల్ పరీక్షలు

కేంద్రాలను పరిశీలించిన ఎస్‌పి

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి :పోలీసు కానిస్టేబుల్ ప్రిలిమినీ పరీక్షలు ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి. ఎస్‌పి విజయరావు పలు కేంద్రాలను పరిశీలించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా ఏర్పాట్లు చేశారు. డికెడబ్ల్యు, విఆర్ పిజి, గీతాంజలీ, క్యూబా కళాశాలను సందర్శించి పరీక్షలు జరుగుతున్న విధానాలను స్వయంగా ఎస్‌పి పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద తీసుకున్న భద్రత చర్యలు, అనుసరించాల్సిన నిబంధనలపై అధి కారులకు పలు సూచనలు చేశారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్144 సి.ఆర్.పి.సి. అమలులో ఉంటున్నం దున, ఎవరు గుంపులుగా ఉండకూడదన్నారు. అధికారులకు వారికి కేటాయించిన ఉద్యోగంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకు ఒటామని హెచ్చరించారు. ప్రవేశ ద్వారం వద్ద ఉన్న సిబ్బంది అభ్యర్థుల తల్లిదండ్రులు, బంధువులు , ప్రెస్ అండ్ మీడియా ప్రతి నిధులతో సహా ఇతరులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించకూడదని ఆదేశాలు జారీ చేశారు. పరీక్షా కేంద్రానికి కేటాయించిన అభ్యర్థులు మరియు సిబ్బందిని వారి హాల్ టిక్కెట్లు మరియు గుర్తింపు కార్డులను సరిచూసుకున్న తర్వాత మాత్రమే అనుమతించారు.పరీక్ష పూర్తయ్యే వరకు మధ్యాహ్నం 1 గంట వరకు అభ్యర్థులెవరూ బయటకు రావడానికి మరియు పరీక్షా కేంద్రం నుండి బయటకు వెళ్లడానికి అను మతించకూడదని ఆదేశించారు.చీఫ్ సూపరింటెండెంట్ మినహా పరీక్షా కేంద్రం లోపల ఇతర వ్యక్తులు లేరని నిర్ధారించు కోవాలి. పరీక్షా కేంద్రం లోకి వెళ్లే ఇతర గేట్లను మూసివేయారు.ఆయాపరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాం ఛనీయ సంఘటనలు చోటు చేసు కోకుండా ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా ఉండేలా సంబంధిత పోలీ సు అధికారులకు తగు సూచనలు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించడంతో సిబ్బంది, అధికారులను అభి నంధించిన తెలిపారు.ఒక్క నిమిషం ఆలస్యం అయినా పరీక్షలకు అనుమతించలేదు.

నేడు తైక్వాండో పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి -కందుకూరు :కందుకూరులోని ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ ఆవరణంలో సోమవారం జిల్లాస్థాయి సబ్ జూనియర్ క్యాడేట్ జూనియర్, సీనియర్ బాల, బాలికల జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా తైక్వాండో కార్యదర్శి ఎస్.కె అబ్దుల్ సలాం తెలిపారు. జిల్లాస్థాయిలో ఎంపికైన క్రీడా కారులు ఈనెల 28, 29, 30 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లోపాల్గొంటారని అన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు పాల్గొనాలని తెలిపారు. వివరాలకు 8686240540, 9494946207 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి :నగరంలోని 54 డివిజన్ వెంకటేశ్వరపురంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా టిడిపి నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ నేత జహీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ఆదివారం కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి సతీమణి కోటంరెడ్డి సంధ్య బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకొని యువతలో క్రీడా నైపుణ్యాన్ని మరింత పెంపొందించేందుకు ఆటల పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడలతో ఆరోగ్యం, మానసికోల్లాసం పెంపొందుతుందన్నారు. క్రీడల అభివద్ధికి తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని ఆమె హామీ ఇచ్చారు విజేతలకు తన అభినందనలు తెలిపారు. మాజీ కార్పొరేటర్ జహీర్ మాట్లాడుతూ టిడిపి నేత కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి సహకారంతో ఈ క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ప్రథమ ద్వితీయ తతీయ బహుమతులను కోటంరెడ్డి సంధ్య అందజేశారు. మైనుద్దీన్ క్లస్టర్ ఇంచార్జ్, సత్య నాగేశ్వరరావు, కపిర శ్రీనివాసులు, కుమారపు బాలాజీ, ప్రశాంత్, పుట్ట అజయ్ కుమార్ రెడ్డి, మొయినుద్దీన్, కమ్మ కళ్యాణి, రేవతి, మానస ,స్థానికులు షమీం ఖాదర్బాషా బాబు షాహిద్, ఆర్గనైజర్స్ వాసు, మౌళి అబ్బాస్ జావిద్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -నెల్లూరు :యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రచురించిన డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వాసిరెడ్డి సుధాకర్ రావు, జకిర్ హొసెన్ పాల్గొని మాట్లాడారు. గడిచిన 29 ఏళ్లుగా యు ఈఈయు డైరీ, క్యాలెండర్లు ఏర్పాటు చేస్తూనే ఉన్నామని తెలిపారు. జిల్లా పెంచల ప్రింట్, నెల్లూరు, నగర, రూరల్, గూడురు. కావలి డివిజల్ నాయ కులు హీరనారాయణ, నాగయ్య, ముని కష్ణయ్య, అంజయ్య, గిరి వాబు, సురేంద్ర, జయంత్ రామయ్య, సురేష్, శ్రీని వాసులు, కాంటిట్టి కొత్తుల జిల్లా కారదరి బొజ్జ సుమన్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి -కందుకూరు

కందుకూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆట స్థలంలో కెపియల్-2 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఎంఎల్‌ఎ మాను గుంట మహీధర్ రెడ్డి ప్రారంభించారు. క్రీడలు వల్ల ఎన్నో పయోజనాలు కలు గుతాయని ఎంయల్ఎ చెప్పారు. ఐపియల్ మాదిరిగానే కెపియల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భారీ నగదు బహుమతులు ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి ఇస్తున్నారని చెప్పారు. పిడి వెంకటరావు, వైసిపి కందుకూరు పట్టణ కన్వినర్ షేక్ రఫి పాల్గోన్నారు.

టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ

రైతులకు సూచనలు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :మండలంలోని చిన్నచెరుకూరు గ్రామ పంచాయతీలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. మండల వ్యవసాయాధికారి యు. గీతాకుమారి ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఇందుకూరుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు ఎ. రాజ్ కుమార్ మండల విఎఏ శివ కుమార్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

వ్యాపారులకు ఛాంబర్ అండ

ప్రజాశక్తి -నెల్లూరు :ఎపిలో వర్తక వాణిజ్య వ్యాపార అభివద్ధిలో ప్రభుత్వానికి వ్యాపార వర్గాలకు ఎపి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండ్రస్ట్రీ అండగా ఉంటుందని ఫెడరేషన్ చైర్మన్ అధ్యక్షులు పైడా కష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని యష్ పార్కు హోటల్లో ఎపి చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ సమావేశం జరిగింది. పైడా కష్ణ ప్రసాద్ మాట్లాడుతూ వర్గాలకు ఎదురవు తున్న సమస్యల పరిష్కారానికి కషి చేస్తూ రాష్ట్ర పారిశ్రామిక అభివద్ధి పురోగతిలో పూర్తిస్థాయి సహాయ సహకారాలు అందించేందుకు చాంబర్ ఆఫ్ కామర్స్ పనిచేస్తుందని ఆయన అన్నారు. నెల్లూరుతో పాటు ఒంగోలు, రాయలసీమ జిల్లాలలో ఫెడరేషన్ సమావేశాలు నిర్వహించబోతుందని ఆయన చెప్పారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ డైరెక్టర్ కోట గురుబ్రహ్మం మాట్లాడుతూ.. ఫెడరేషన్ అభివద్ధిలోనూ సంస్థ సహాయ సహకారాలు అందిస్తుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర చాంబర్ ఆఫ్ కామర్స్ జనరల్ సెక్రెటరీ బి. రాజశేఖర్, కోశాధికారి అక్కయ్య నాయుడు ... పాటు వ్యాపార వాణిజ్య వర్గాల ప్రతినిధులు నాయకులు యెత్తున హాజరయ్యారు.

మాట్లాడుతున్న పైడా కృష్ణ ప్రసాద్

టిడిపిని ఆదరించండి : కురుగొండ్ల

ప్రజాశక్తి -రాపూరు :రాపూరు తెలుగు గంగ గెస్ట్ హౌస్‌లో టిడిపి అనుబంధం సంఘాల దళితుల వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ముఖ్య అతిథిగా వెంకటగిరి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కురుగొండ్ల రామకష్ణ, మాజీ మంత్రి పరసారత్నం పాల్గొన్నారు. కురు గొండ్ల రామకష్ణ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అందరూ తమకే ఓటేసి తనని అధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు..రాపూరు మండల అధ్యక్షులు దందోలు వెంకటేశ్వర్లు రెడ్డి గారు, గ్రామ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, నాయకులు కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను బలోపేతం చేయాలి

ప్రజాశక్తి -గుడ్లూరు :జిల్లాలోని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, పంచాయతీల్లో వసూలు చేస్తున్న ఇంటి పన్నుల్లో 8శాతం గ్రంథాలయ పన్నులను జిల్లా గ్రంథాలయ శాఖకు జమ చేయాలని, ఆ మేరకు నూతన పాలక వర్గం కషి చేయాలని లోక్ సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యులు ఎం మాలకొండారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ఇక్కడ మాట్లాడారు. ఆర్ సి నెంబర్ 30 సి/2007 ఉత్తర్వుల మేరకు డి. సి. బి లెక్కల ప్రకారం పంచాయతీ, మున్సిపాలిటీ లలో వసూలు చేస్తున్న ఇంటి పన్ను 8శాతం వెంటనే జమ చేయాలని తెలిపారు. గ్రంథాలయాలను పరిపుష్టం చేయాల్సిన అవసరముందన్నారు.

టిడిపి విజయమే లక్ష్యం...!

-చంద్రబాబు సిఎం కావాలి

-టిడిపి నేత ఇంటూరి రాజేష్

ప్రజాశక్తి -కందుకూరు

టిడిపి విజయం, చంద్రబాబు నాయుడు సిఎం కావటమే లక్ష్యంగా తాను పని చేస్తానని టిడిపి నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్ చెప్పారు. ఆదివారం ఆయన ఇక్కడ విలేకర్లతో మాట్లాడారు. పార్టీ అభివద్దే లక్ష్యంగా పని చేస్తున్నాం తప్ప గ్రూపులు కట్టడం తెలియదన్నారు. శివరాం సూచనలు చేస్తే స్వీకరిస్తాం.. సలహాలిస్తే పాటిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో కందుకూరు నియోజకవర్గంలో తెలుగుదేశం అభ్యర్థి విజయం సాధించటం ద్వారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావటమే లక్ష్యంగా పని చేస్తున్నాము తప్ప వ్యక్తిగత స్వార్థం, వ్యూహాలు, గ్రూపులు కట్టడం తనకు తెలియదని రాజేష్ పేర్కొన్నారు. రెండేళ్లుగా పార్టీ అభివద్ధికి ఎలా పాటుపడుతున్నానో, కార్యకర్తల కష్టాలు తీర్చటానికి తనవంతు ఎలా పని చేస్తున్నానో, పంచాయతీ ఎన్నికల సమయంలో ఏమి పాత్ర పోషించానో అందరికీ తెలిసిందేన్నారు. కందుకూరులో వేరొకరికి ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇచ్చినా తాను పార్టీ కోసమే పని చేస్తున్నానన్నారు. టిడిపి అధికారంలోకి రావటం, చంద్రబాబునాయుడు సిఎం కావడటమే తన లక్ష్యమన్నారు. ఇటీవల చంద్రబాబు నాయుడు రోడ్ షో ఏర్పాట్లులో నేను పోషించిన పాత్ర, ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో తనవంత పాత్ర ఎవరికీ తెలియందికాదన్నారు. ఎంత పార్టీ మీద పిచ్చి, అధినాయకుల మీద అభిమానం ఉన్నా స్థానికంగా కొన్ని సందర్భాలలో తమ వాళ్లే వ్యూహంతో ఆత్మ గౌరవాన్ని దెబ్బకొట్టడం ద్వారా తనను నిరుత్సాహ పరచాలని ప్రయత్నిస్తున్నా ఆత్మ గౌరవాన్ని కాపాడుకుంటూనే పార్టీ అభివద్ధికి రాజీలేకుండా కృషి చేస్తున్నానన్నారు. భవిష్యత్తులో యువనేత, మన ఆశాకిరణం లోకేష్ బాబు తలపెట్టిన యువగళం పాదయాత్ర విజయవంతం కోసం తనవంతు పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలలో కూడా కందుకూరులో పాల్గొనకపోవటం ఆత్మగౌరవ సమస్య తప్ప మరొకటి కాదన్నారు. కందుకూరు లో పెద్దలు, మాజీ ఎమ్మెల్యే దివి శివరాం ఆసందర్భంగా తన పేరు ప్రస్తావించి రాజేష్ అండ్ కంపెనీ అని మాట్లాడటం బాధించిందన్నారు. శివరాం అంటే నాకు అభిమానం, గౌరవం ఉన్నాయి. ఆయన పిలిచి అలా కాదు ఇలా చేద్దాం అంటే ఆసూచన పార్టీ అభివద్ధికి ఉపయోగపడుతుంది అనిపిస్తే పాటించడానికి నేను ఎల్లప్పుడూ సిద్ధంగానే ఉన్నానన్నారు.

మాట్లాడుతున్న ఇంటూరి రాజేష్

ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి...

కందుకూరు :కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాలతో కందుకూరు పట్టణంలోని 31 వ వార్డులో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ శాసన సభ్యులు దివి శివరాం, ఇతర నాయకులు ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రచారం నిర్వహించడంతో పాటు వార్డులో సమస్యల గురించి తెలుసుకున్నారు. శివరాం మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివద్ధిని పూర్తిగా పక్కన పెట్టేసారని, కేవలం అరకొర సంక్షేమ పథకాలతో పాలన చేస్తున్నారని విమర్శించారు. విద్యుత్ చార్జీలు నిత్యవసర వస్తువుల ధరలు ఇతర పన్నులు భారీగా పెంచేయడంతో ప్రజలు బ్రతికే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే మార్గాలను పక్కనపెట్టి, కేవలం అప్పులు తెచ్చి ప్రజలకు పంచి పెడుతున్నారన్నారు. దీనివల్ల రాష్ట్రం ఎలా అభివద్ధి చెందుతుందో చెప్పాలని వైసీపీ నేతలను శివరాం ప్రశ్నించారు. మళ్లీ టిడిపి అధికారంలోకి వచ్చి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం గాడిలో పడుతుం దన్నారు. వార్డు అధ్యక్షుడు అత్తింటి శివకష్ణ, వార్డు నాయకులు సవిడి బోయిన సాయి, అత్తంటి శ్రీలక్ష్మి, పీలా శ్రీను, రోశయ్య రావి సరిత, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు దివి సౌభాగ్య, రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి చిలకపాటి మధు, రాష్ట్ర మైనారిటీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నరేంద్ర, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే, నెల్లూరు పార్లమెంటు మహిళా కార్యదర్శి బత్తిన ఆదెమ్మ, నియోజవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు నాదెండ్ల వెంకట సుబ్బారావు ఉన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

ప్రజాశక్తి - పొదలకూరు

పట్టణంలోని అయ్యప్ప నగర్‌లో నిర్మాణం పూర్తి చేసుకున్న శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం నుంచి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభంకానున్నాయి. సోమవారం నుంచి ఈనెల 27వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ఈ వేడుకల్లో రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఈ మహోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆలయ కమిటీ చైర్మన్ బోయిళ్ళ మాలకొండారెడ్డి ఇటీవల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ మూల కర్త అల్లూరు రమణయ్య, ఆలయ నిర్మాణ కమిటీ కార్యదర్శి మోహన్ రావులు మాట్లాడుతూ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

బిందు మీనన్ ఫౌండేషన్ సేవలు విస్తృతం

ప్రజాశక్తి -నెల్లూరు :డాక్టర్ బిందు మీనన్ ఫౌండేషన్ సేవలను జిల్లాలో మరింత విస్తతం చేస్తున్నట్లు డాక్టర్ బిందు మీనన్ పేర్కొన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు 200 ఉచిత వైద్య శిబిరాల ద్వారా ఎంతోమందికి సేవలు అందించా మన్నారు. భవిష్యత్తులోనూ దీనిని కొనసాగిస్తామని తెలిపారు. మూర్చ, బ్రెయిన్ స్ట్రోక్, నరాలకు సంబంధించిన వ్యాధులకు ఉచిత వైద్య సేవలు అందిస్తూ ఎంతోమంది నిరుపేదలు జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. ఈ ఫౌండేషన్ 2013 ఆగస్టు 26వ తేదీ ప్రారంభమై ఇప్పటివరకు 200 ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిం చామన్నారు. దేశంలోనే ప్రప్రదమంగా నూరాలజీ అండ్ వీల్స్ ద్వారా 12,000 మందికి ఉచిత వైద్య సేవలు అందించడంతోపాటు మందులు పంపిణీ చేశామన్నారు. 352 హైపర్‌టెన్షన్, 129 డయాబెటిస్, 138 స్ట్రోక్ తోపాటూ105 మూర్చ కేసులను గుర్తించామన్నారు. 210 అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి, 35 వేల మంది ప్రజలకు మూర్చా, బ్రెయిన్ స్ట్రోక్, తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు.

ప్రజలపై భారాలు మోపడం సరికాదు : సిపిఎం

ప్రజాశక్తి -ఉలవపాడు : పేదలపై మోపుతున్న భారాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని సిపిఎం సిపిఎం మండల కార్యదర్శి జివిబి కుమార్ పేర్కొన్నారు. సిపిఎం ఉలవపాడు మండల కమిటీ సమావేశం స్థానిక లిటిల్ ఏంజిల్స్ స్కూల్ వద్ద మండల కమిటీ సభ్యులు వీసం.విజయ్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జివిబి కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న సంస్కరణలను బిజెపి పాలిత రాష్ట్రాలతోపాటు అనేక రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకిస్తుంటే, రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేయడానికి పూనుకోవటం దారుణమన్నారు. స్మార్ట్ ,ప్రీపెయిడ్, ట్రూ ఆప్ చార్జీల పేరుతో వినియోగదారులపై వేల కోట్ల రూపాయలవిద్యుత్ చార్జీల భారాలను మోపుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తానన్న హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్‌సి, ఎస్టీలకు ఇచ్చే సబ్సిడీని యధాతదంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. పేదలపై భారాలు వేస్తున్న ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తామన్నారు. సిపిఎం ఉలవపాడు మండల కమిటీ సభ్యులు కొమరగిరి శేషమ్మ ఎస్ మాచర్లరావు, ఏలూరి నాగార్జున,ఎస్.కే.మీరాసా పాల్గొన్నారు.



ఉలవపాడులో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు జివిబి కుమార్

వలేటివారిపాలెం :రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా విద్యుత్ ఛార్జీలు పెంచడం, కేటగిరిల వారీగా స్మార్ట్ మీటర్లు బిగించి ప్రజలు, రైతులపై ఛార్జీల భారం మోపాలని చూడటం తగదని వివిపాలెం మండల సిపిఎం కార్యదర్శి మాదాల రమణయ్య పేర్కొన్నారు. మండల సిపిఎం శాఖా సమావేశం పివి రామారావు అధ్యక్షతన ఆదివారం వలేటివారిపాలెంలో జరిగింది. సమావేశంలో మండల పార్టీ ఇన్‌చార్జి జివిబి కుమార్, రమణయ్య మాట్లాడారు. ప్రభుత్వం ప్రజలకిచ్చిన వాగ్దానాలు విస్మరించి, మోయలేని భారాలు మోపుతుందన్నారు. ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి మళ్లించి, దళిత, గిరిజనుల అభివృద్ధిని విస్మరించిందన్నారు. వ్యవసాయానికి 12 గంటల పాటు ఉచిత విద్యుత్ అందించాలన్నారు. భవిష్యత్తులో ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. సిఐటియు మండల నాయకులు సాదు చెన్నకేశవులు, సిపిఎం నాయకులు దువ్వూరి జాన్, ఎన్ కోటేశ్వరరావు, ఎం లాజరు పాల్గొన్నారు.

నింగినంటుతున్న కూరగాయల ధరలు

వినియోగదారుల ఆందోళన

ప్రజాశక్తి -కందుకూరు

కూరగాయల ధరలు పెరుగుతుండటంతో వినియోగదారులు బెంబేలెత్తి పోతున్నారు. పది రోజుల కిందట వరకు కూరగాయల ధరలు ప్రజలకు కొద్దిగా అందుబాటులో ఉన్నాయి. రూ. 1000 మార్కెట్‌కు తీసుకెళ్తే సంచి నిండుగా వచ్చే పరిస్థితి ఉండేది. గడిచిన పది రోజులుగా ఆ పరిస్థితి లేదు. రోజురోజుకు కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. దీంతో కూరగాయలు కొనడం కష్టమనే భావన వినియోగదారుల్లో కనిపిస్తోంది. పది రోజుల కిందట టొమాటో కేజీ రూ.14లు ఉండగా ప్రస్తుతం అది రూ. 30కి చేరింది. కేజీకి రూ.16లు పెరిగింది. వంకాయల ధర కేజీ రూ.40లు ఉండగా ప్రస్తుతం కేజీ రూ.50లు పలుకుతుంది. బెండకాయలు ధర కేజీ రూ.40 నుండి 54లకు పెరిగింది. మిర్చి ధర కేజీ రూ.30 నుంచి 40 లకు పెరిగింది. కాకరగాయలు కేజీ రూ.31 నుండి రూ.42కు చేరింది. బీరకాయల ధర కేజీ రూ.50 నుండి రూ.60కి పెరిగింది. దొండకాయలు ధర కేజీ రూ.35 ఉండగా అది రూ.50కి పెరిగింది. బంగాళదుంపలు కేజీ రూ.15లు నుండి రూ.30కి పెరిగింది. దోసకాయల ధర కేజీ రూ.10లు నుండి రూ.23కి పెరిగింది. పొట్లకాయల ధర కేజీ రూ.30నుంచి రూ.40కి చేరింది. బీట్రూట్ ధర రూ.30 నుండి రూ.38లకు పెరిగింది. కూరగాయల ధరలు ఇక రోజు రోజుకి పెరుగుతూనే ఉంటాయని వ్యాపారులు చెబుతున్నారు. కందుకూరు పరిసర ప్రాంతాల్లో కూరగాయలు దాదాపు లేకపోవడంతో బయట నుండి మార్కెట్కి వచ్చే వాటిని అమ్మకాలు చేయాల్సిన పరిస్థితి ఉంది. కందుకూరు ప్రాంతంలో రైతులు కూరగాయలు సాగు చేస్తే వాటిని మార్కెట్ లో అతి తక్కువ ధరకు కొనుగోలు చేయడంతో రైతులు కోతకూలి కూడా రాలేదని వాపోయారు. అప్పుడు రైతుల వద్ద తక్కువకు కొని వినియోగదారులకు కూడా అందుబాటు ధరలకు అమ్మకాలు చేయడం జరిగింది. పెరుగుతున్న నిత్యావసర సరుకులతో పాటు కూరగాయల ధరలు కూడా ఆకాశాన్ని అంటితే ఇక ఏమి కొని ఏమి తినాలి అనే ఆందోళనలో ప్రజలు ఉన్నారు.

విజేత జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న పోలంరెడ్డి దినేష్‌రెడ్డి

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

క్రీడలు శారీరక, మానసిక ఉత్సాహంగా పొందుతారని యువత క్రీడల్లో రాణించాని పోలంరెడ్డి దినేష్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పల్లిపాడు గ్రామంలో నందమూరి బసవరామ తారకం మెమోరియల్ ఫౌండర్ జాన గిరిబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌కు బహుమతి ప్రదాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా మొదటి బహుమతి రూ.50వేల నగదును ఎన్ఎస్ఆర్‌సిసికు గెలుపొందగా, రెండవ బహుమతి రూ.25వేల నగదును, బిహెచ్ఎస్ ఎక్స్పర్ట్స్ కైవసం చేసుకుంది. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్‌టి రామారావుపై అభిమానంతో గత 30 సంవత్సరాల నుంచి నిర్విరామంగా క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్న జానా గిరిబాబును అభినందించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రావెళ్ల వీరేంద్ర చౌదరి, చెంచుకిషోర్ బాబు, చెముకుల కృష్ణచైతన్య, బసవతారకం మెమోరియల్ కమిటీ మెంబర్స్ పాల్గొన్నారు.



మేనిఫెస్టోను అందజేస్తున్న ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత

ప్రజాశక్తి-బిట్రగుంట

సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పిస్తున్నారని ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. తాళ్లూరులో గ్రామంలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గడప గడపకు తిరిగి ప్రభుత్వ పథకాల కరపత్రాలను పంచి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంలో మహిళలకు, రైతులకు, పేదవారికి అన్ని విధాల సహాయ సహకారాలను అందించిన ఏకైక ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని, పార్టీలకు అతీతంగా ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు చేరే విధంగా సచివాలయ వాలంటరీ వ్యవస్థను తీసుకువచ్చి ప్రతి సమస్యను సచివాలయ సిబ్బందితో పనులు పూర్తి చేసేలా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్, వైసిపి మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, ఎంపిటిసి ఎకె సుందర్‌రాజు, మద్దిబోయిన శేఖర్, కంటేపల్లి క్రిష్టయ్య, అన్ని శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ధనుంజయరెడ్డితోనే వైసిపి బలోపేతం

ప్రజాశక్తి-సీతారామపురం

ఉదయగిరి నియోజకవర్గంలోని వైసిపిలో నెలకొన్న వర్గ విభేదాలను తొలగించి పార్టీ బలోపేతం చేయడం నియోజకవర్గ పరిశీలకులు కొడవలూరు ధనుంజయ రెడ్డితోనే సాధ్యమని మాజీ జెడ్‌పిటిసి దుగ్గిరెడ్డి గురవారెడ్డి, రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ పి.సి.అల్లూరురాజు పేర్కొన్నారు. ఆదివారం సీతారామపురంలో వారు విలేకరులతో మాట్లాడుతూ పార్టీ అధిష్టానంతో పాటు జిల్లా అధ్యక్షులు రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆదేశాలతో ప్రస్తుతం నియోజకవర్గంలోని 8 మండలాలకు చెందిన అసమ్మతి నేతలతో నియోజకవర్గ పరిశీలకుడు అంతరంగిక చర్చలు జరుపుతూ అందరిని పార్టీకి లోబడి ఉండేలా ఏకతాటిపైకి తీసుకురావడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు అబ్బిరెడ్డి, మండ్లా వెంకటేశ్వర్లు, వాడకొప్పు వెంకటయ్య, ఆరేళ్ల దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'పవన్న ప్రజాబాట'

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు సిటీ నియోజకవర్గంలో జనసేన పార్టీ నాయకులు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్విరామంగా, నిరాటంకంగా జరుగుతున్న పవనన్న ప్రజాబాట కార్యక్రమం 251వ రోజుకు చేరింది. ఆదివారం 54వ డివిజన్లో జనార్ధన్ రెడ్డి కాలనీ ఇస్మాయిల్ పేట ప్రాంతంలో నిర్వంహించారు. ఇక్కడ ప్రతి ఇంటికీ వెళ్లిన కేతంరెడ్డి ప్రజల సమస్యలను అధ్యయనం చేసి అండగా నిలబడతామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా కేతంరెడ్డి వినోద్‌రెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల ముందు పాదయాత్రలో ముస్లిం మైనారిటీల అభివృద్ధి కోసం అనేక హామీలు గుప్పించిన సిఎం జగన్‌రెడ్డి ఒక్క హామీని కూడా నెరవేర్చలేక పోయారన్నారు. మైనారిటీ కార్పొరేషన్ ద్వారా ముస్లింలకు ఋణాలిచ్చి ఆర్థికంగా ఆదుకోవాల్సిన ప్రభుత్వం కేవలం ఉచిత పథకాల సొమ్ముని సాయం కింద చూపిస్తూ మోసం చేసిందని తెలిపారురు. దుల్హన్ పథకం నిలుపుదల, వక్ఫ్ భూములను నిర్వీర్యం చేయడం దగ్గర నుండి ప్రతి అంశంలో ఈ ప్రభుత్వం దగా చేసిందన్నారు. ఉర్దూని రెండో అధికార భాషగా ప్రకటించారు కానీ ఇప్పటివరకు ఎందుకని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉర్దూ ట్రాన్సలేటర్ పోస్టులను విడుదల చేయలేదని తెలిపారు. గత ప్రభుత్వాలు ప్రతి ఏటా ఎండాకాలంలో పేద ముస్లిములకు ఆసరాగా వారి పిల్లలకు ఉచితంగా ఒడుగులు తీసే కార్యక్రమం (ఖత్నా) జరిగేదని, ఆఖరికి ఆ ఖత్నా కార్యక్రమాన్ని కూడా వైసిపి ప్రభుత్వం ఈ మూడేళ్లలో జరపలేదని దుయ్యబట్టారు.

పింఛన్ తొలగింపుపై బాధితుల ఆవేదన

ప్రజాశక్తి-అల్లూరు

రాష్ట్ర ప్రభుత్వం పింఛన్లు తొలగిస్తే హైకోర్టును ఆశ్రయిస్తామని బాధిత ప్రజలు పేర్కొన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సమయంలో అనేక వాగ్దానాలు చేపట్టి మాటల గారడీతో దగా చేశారని పేర్కొంటున్నారు. పరిపాలన చేతకాక పేద ప్రజలపై ఉక్కుపాదం మోపడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. మండలంలోని పలు ప్రాంతాల ప్రజలు అలాగే నార్త్ మోపూరు గ్రామానికి చెందిన బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నోటీసులతో తీవ్ర ఆందోళన వ్యక్తపరిచారు. అధికార పార్టీకి అధికారులు దాసోహంగా వ్యవహరిస్తూ కీలు బొమ్మలుగా వ్యవహరించడం తీరని ద్రోహమన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత రావడంతో జనవరిలో పింఛన్లు తొలగించబోమని ఫిబ్రవరి నుండి పింఛన్లు తొలగించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తమకు అన్యాయం చేస్తే జగన్మోహన్ రెడ్డిపై పోరాటం కొనసాగించి హైకోర్టును ఆశ్రయమిస్తామని నార్త్‌మోపూరు ప్రజలు హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత కారణంగా గందరగోళ వాతావరణం నెలకొందని వారంటున్నారు. ఇచ్చిన నోటీసులకు అధికారులు సమాధానం చెప్పలేక ముఖం చాటేస్తున్నారని ఆరోపణలు వ్యక్తపరుస్తున్నారు.

'సంయుక్త' ఆధ్వర్యంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-కావలి

వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ బి.సతీష్

సంయుక్త సేవాసంస్థ ఆధ్వర్యంలో జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం నెల్లూరు, కావలి ఐఎంఎ వారి సహకారంతో జి.వంశీ, బి.శ్రీనాద్, ఎస్.శ్రీరాం బ్రహ్మం, జె.గంగాధర్, బి.భాగ్యరాజ్, జి.అనీల్‌కుమార్,ఎన్.నరేష్, జి.సుజన్, టి.శివ కుమార్, ఎం.క్రిష్ణ కిశోర్ దాతృత్వంతో తుఫాన్ నగర్లో ఉన్న శ్రీ పొట్టి శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన కావలి ఐఎంఎ ప్రెసిడెంట్ డాక్టర్ బి.సతీష్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ వైద్యశిబిరంలో డాక్టర్ బెజవాడ రవి కుమార్, డాక్టర్ బి సుబ్బారావు, డాక్టర్ సుధీర్ కుమార్, డాక్టర్ శివ ప్రసాద్, డాక్టర్ ఉమా చందలు పాల్గొని పేదలకు వైద్య సేవలు అందించారు. ఈ వైద్య శిబిరంలో పాల్గొన్న పేదలకు సంస్థ ద్వారా ఉచితంగా సుగర్ పరీక్షలు, ఇండియన్ రెడ్‌క్రాస్ వారి సహకారంతో ఉచితంగా బ్లెడ్ గ్రూపులు, రవి నర్సింగ్ హోమ్ వారి సహకారంతో బిపి, రక్త శాతం పరీక్షలు ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధీర్ కుమార్, డాక్టర్ ఉమాచంద్ మాట్లాడుతూ సంయుక్త సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పాల్గొన్న పేదలకు సుగర్ వ్యాధిపై, గుండె వ్యాధులపై ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించారు. సంయుక్త సేవాసంస్థ ద్వారా నిర్వహిస్తున్న అనేక సేవల్లో భాగంగా ఈ వైద్య శిబిరం పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగ పడుతుందని తెలియజేశారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి జరిగే ఈ వైద్య శిబిరంలో పేదప్రజలు పాల్గొని వైద్యసేవలు తీసుకోవాలని తెలియజేశారు. తదుపరి వైద్య శిబిరం మార్చి26న ఇదే పాఠశాల లో జరుగుతుందని తెలిపారు. అనంతరం కార్యక్ర మానికి సహాయం అందజేసిన దాత క్రిష్ణకిశోర్‌తో పాటు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లకు చిరు సత్కారం చేసి, వైద్య శిబిరంలో పాల్గొని వాలంటీర్ సర్వీస్ చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో నెల్లూరు జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం నుంచి కామయ్య, దాత ఎం.క్రిష్ణ కిశోర్, పాఠశాల పేరెంట్స్ కమిటీ ప్రెసిడెంట్ జ్యోతి, సంస్థ అధ్యక్షుడు సురేంద్ర, సంస్థ సభ్యులు ఎం.అజిత్ బాబు, పి.జానకి రామ్, జి.కళ్యాణి, జెవివి ప్రెసిడెంట్ తోట వెంకటేశ్వర్లు, ఆకుల.రమణయ్య, నారాయణ, షేక్. ఖాధర్ బాషా, హరి నాథ్ వారి సభ్యులు, ఎంవిఎన్ ప్రసాద్ రావు, డాన్స్ మాస్టర్ ముత్తశెట్టి. ఉమామహేశ్వరరావు సేవలందించారు.

రైతుల సమస్యలపై అఖిలపక్షం సమావేశం

ప్రజాశక్తి-ఆత్మకూర్ అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న అఖిలపక్షం నాయకులు

రైతుల సమస్యలపై పరి ష్కారం కోసం ఆదివారం పలు పార్టీల నాయకులతో కలిసి అఖిలపక్ష సమావేశం పట్టణం లోని సిపిఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి 26న అఖిలభారత కిసాన్ సభ పిలుపు మేరకు రైతు సమస్యల పరిష్కారం కోసం ఆత్మకూరు పట్టణంలో ట్రాక్టర్ల ప్రదర్శన జరుగుతుందన్నారు. ప్రభుత్వం వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టడం, సకాలంలో ఎరువులు ఇవ్వలేక పోవటం, ధాన్యం కొనుగోలు విషయంలో ఫెయిల్యూర్ తదితర విషయాలను చర్చించేందుకు చర్చించారు. రైతు సమస్యల పరిష్కారం కోసం గ్రామ, పట్టణ, నియోజకవర్గ స్థాయి కమిటీలు వేసి రైతు సమస్యల కోసం పోరాటం చేసేందుకు సిద్ధం చేస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం తరపున గంటా లక్ష్మిపతి, కన్వీనర్ కెవి శేషారెడ్డి, తెలుగు రైతు తరపున టిడిపి, చంద్ర వెంకట సుబ్బానాయుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు, పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, తెలుగు మహిళా నాయకురాలు పులిమి శైలజ, సిఐటియు తరపున ఆత్మకూరు నాగయ్య, ఎపి రైతు సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు లక్కు ప్రసాద్, కృష్ణమోహన్ చర్లో సుబ్బ రామిరెడ్డి, చిల్లకూరు రమణారెడ్డి, పి.వెంకట రామి రెడ్డి, ఒంటేరు మల్లికార్జున, బాపనపల్లి రమణయ్య, వాగాల పెంచలయ్య, తదితరులున్నారు.

ప్రమాదకరంగా మలుపులు..

ప్రజాశక్తి-వరికుంటపాడు

మండలంలోని విరువూరు నుంచి పెద్దిరెడ్డిపల్లి వెళ్లే రోడ్డులో ప్రమాదకరమైన మలుపులుడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వాటికి సంబంధించి ఎటువంటి హెచ్చరిక బోర్డులు సైతం లేకపోవడంతో పలుప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయని స్థానికులు తెలియజేస్తున్నారు. ఆర్ అండ్ బి అధికారులు తగు సూచిక బోర్డులు మలుపులు దగ్గర ఏర్పాటు చేసి, రాబోయే రోజుల్లో ప్రమాదాలను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న దృశ్యం

బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-అల్లూరు

మండలంలోని నార్త్ మోపూరు గిరిజన కాలనీకి చెందిన పులి శ్రీహరి(20) 20వ తేదీ పాముకాటు గురై మరణించగా ఆ కుటుంబాన్ని ఆదివారం నేషనల్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు, వైసిపి ఎస్‌టిసెల్ మండల అధ్యక్షులు దాసరి పోలయ్య పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకుతెరువు కోసం వెళ్లి ప్రాణం విడిచి వెళ్లాడంటూ విచారం వ్యక్తం చేశారు. సంబంధిత విషయాన్ని ఐటిడిఎ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఆ కుటుంబానికి న్యాయం చేస్తానని హామీనిచ్చారు. గోగులపల్లికి వెళ్లేదారిలో ఉన్న సాల్ట్ ఫ్యాక్టరీ సమీపంలోని పొలాల వద్ద మందును పిచికారి చేస్తూ ఉండగా ఈ దుర్ఘటన జరిగిందని వివరించారు. హుటాహుటిన నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడే మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. అలాగే స్థానికుల ద్వారా మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

కొనసాగుతున్న నెట్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్

పట్టణం లోని గవర్నమెంట్ హైస్కూల్లో ఆదివారం రెండవ రోజు రాష్ట్రస్థాయి నెట్‌బాల్ సెమీఫైనల్స్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్లో అనంత పురం, కడప బాలుర విభాగంలో విశాఖపట్నం, కడప జట్లు విజేతులుగా నిలిచాయి. అండర్ 17 బాలికల విభాగంలో నెల్లూరు, అనంతపురం బాలుర విభాగంలో నెల్లూరు వెస్ట్ గోదావరి జట్లు విజయం సాధించాయి. సెమీఫైనల్ విజేతల మధ్య సోమవారం ఫైనల్స్ నిర్వహిస్తారు. క్రీడకారులతో ఆదివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానం కళకళలాడింది. క్రీడల ఆర్గనైజర్ తిరుపాలు ఈ సందర్భంగా తెలియజేశారు.

పురుగుమందు తాగి విఆర్ఒ ఆత్మహత్య

ప్రజాశక్తి-మర్రిపాడు

అనారోగ్య కారణాలతో ఓ విఆర్ఒ పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. వివరాల మేరకు.. మర్రిపాడు మండలం నందవరం గ్రామానికి చెందిన దాసరి లక్ష్మి నారాయణ (42) చేజర్ల మండలం ఆదూరుపల్లి విఆర్ఒగా పని చేసేవారు. ఆయన అనారోగ్య కారణాలతో 21వ తేదీన పురుగు మందుతాగగా కుటుంబసభ్యులు నెల్లూరు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. మర్రిపాడు ఎస్ఐ విశ్వనాధ్ రెడ్డి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గ్రంథాలయాలతో యువతకు విజ్ఞానం

ప్రజాశక్తి-బిట్రగుంట

మాట్లాడుతున్న డాక్టర్ ఎం వి రమణయ్య

విద్యార్థులు విజ్ఞానం పెంచుకునేందుకు గ్రంథాలయం ఎంతో అవసరమని డాక్టర్ రామచంద్రారెడ్డి హాస్పిటల్ ప్రముఖ సీనియర్ వైద్యులు ఎంవి రమణయ్య పేర్కొన్నారు. మండలంలోని సిపిఎం కార్యాలయంలో ఆదివారం గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంవిరమణయ్య పాల్గొని గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత నిస్సహాయతను కోల్పోకుండా అన్ని రంగాల్లోనూ ముందుండాలని, ప్రభుత్వ ఉద్యోగ రాత పరీక్షలు నెగ్గేందుకు గ్రంథాలయం ఎంతగానో ఉపయోగపడుతుం దన్నారు. ఈ సందర్భంగా మండల సిపిఎం కార్యదర్శి తుమ్మల వెంకయ్య, సిఐటియు మండల కార్యదర్శి చల్లా నరహరి, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు టి.మాల్యాద్రి, డాక్టర్ ఆనంద్ సాగర్ మాట్లాడారు. మండలంలో నిరుద్యోగ యువత సిపిఎం కార్యాలయంలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు గ్రంథాలయం తెరిచి ఉంటుందని, ఈ అవకాశాన్ని నిరుద్యోగులు ఉపయోగించుకొని ప్రభుత్వ ఉద్యోగాల్లో పరీక్షల్లో ఉత్తీర్ణలు అవ్వాలని కోరారు. కార్యక్రమంలో నార్త్ ఆములురు చైల్డ్ ఆశ్రం నిర్వాహకులు రామచంద్ర శరత్ బాపూజీ, సిపిఎం నాయకులు ఎన్.రామయ్య, పొట్లూరి. శ్రీనివాసులు, విశ్వనాథరావుపేట ఎస్ఆర్‌కె స్కూల్ కరస్పాండెంట్ జి.హరిబాబు, జూనియర్ కాలేజ్ తెలుగు లెక్చరర్ వేదవతి, చిలకపాటి వెంకయ్య రైల్వే విశ్రాంతి అధికారి నెల్లూరు, సిపిఎం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలు అందించడమే ప్రధాన లక్ష్యం

- డాక్టర్ బిందు మీనన్ వెల్లడి

ప్రజాశక్తి-అల్లూరు

మాట్లాడుతున్న న్యూరాలజిస్ట్ బింధుమీనన్

గ్రామాలలో ప్రజలకు విస్తతంగా వైద్య సేవలు అందించడమే తన ప్రధాన లక్ష్యమని ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ బిందు మీనన్ వెల్లడించారు. ఆదివారం మండలంలోని ఇస్కపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద బిందు మీనన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత న్యూరాలజీ మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన తల్లిదండ్రుల ప్రోత్సాహంతో గ్రామీణ ప్రాంతాలలో ప్రజల వద్దకే వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. 2013 నుండి ఇప్పటివరకు సుమారు 200 ఉచిత మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి సేవ చేస్తున్నట్లు వివరించారు. బిపి, సుగర్, పక్షవాతం, మూర్ఛ, తలనొప్పి, పార్శ నొప్పికి వైద్య పరీక్షల నిమిత్తం అవసరం మేరకు మందులు వాడాలని తెలియజేశారు. అలాగే కొన్ని అలవాట్లను దూరం చేసుకుంటే ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ గ్రామంలో ప్రతి 3 నెలలకు ఒకసారి మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపిపి దర్శగుంట శశిరేఖ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కావలి ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కావలసిన పరికరాలు అందజేస్తున్నారని వివరించారు. అలాగే ఈ గ్రామవాసి రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు కృషితో ఎంతో అభివృద్ధి జరిగిందని తెలియబరిచారు. న్యూరాలజిస్ట్ బిందుమీనన్ ఇక్కడికి విచ్చేసి వైద్య సేవలు అందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అల్లూరు ప్రభుత్వ వైద్యశాలలో రక్త కణాల పరీక్ష యంత్రాన్ని ఏర్పాటు చేసి చేసి ఉన్నట్లు ప్రజలకు తెలియబరిచారు. అనంతరం ఆమెను ఘనంగా శాలువాతో సత్కరించి కేక్ కట్ చేసి పంచి పెట్టారు. ఈ మెడికల్ క్యాంపులో సుమారు 110కి పైగా వైద్య సేవలు ఉచితంగా అందించారు. కార్యక్రమంలో డాక్టర్ నవీన్ కుమార్, దర్శి గుంట వెంకయ్య, దళవాయి మునిరాజా, బీద మహిధర్, సూపర్‌వైజర్ పందల కృష్ణయ్య తదితరులున్నారు.

మద్యం సేవించి వాహనాలు నడుపరాదు

ప్రజాశక్తి-మర్రిపాడు

మద్యం సేవించి వాహనాలు నడుపరాదని, జాగ్రత్తలు పాటించాలని వాహనదారులకు ఎస్ఐ విశ్వనాథ్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు ఆదివారం జాతీయ రహదారి భద్రత వారోత్సవాలలో భాగంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచనలు తెలియజేశారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన పత్రాలు తప్పనిసరిగా దగ్గరనే ఉండాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలలో భాగంగా అమూల్యమైన ప్రాణాన్ని కోల్పోయి కుటుంబానికి తీరని లోటు కలిగించవద్దని పోలీస్ స్టేషన్ తరపున మండల ప్రజలకు తెలియజేస్తున్నామన్నారు.

లోకేష్ జన్మదిన వేడుకలు విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకల ను విజయ వంతం చేయాలని టిడిపి మం డల అధ్యక్షులు చింతన బోయిన బయన్న పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం బస్టాండ్ సెంటర్‌లో ఉదయం 10 గంటలకు మండల కమిటీ అధ్వర్యంలో నారా లోకేష్ జన్మదిన వేడుకలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ జెడ్పి చైర్మన్ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి చెంచలబాబుయాదవ్ పాల్గొంటారన్నారు. పార్టీ కుటుంబ సభ్యులు అభిమానులు, కార్యకర్తలు టిఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత, ఐటిడిపి, టిఎన్‌టియుసి నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

రైతులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి-కోవూరు

మండలంలోని గుమ్మళ్లదిబ్బలో సిజెంటా కంపెనీవారు ఆదివారం రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కంపెనీ వారు మాట్లాడుతూ వరిలో నాలుగు దశలు ఉంటాయని పైరు ఎదుగుదల పునరుత్పత్తి, పంట పండటం మొదటి రెండు దశలు సామర్థ్యాన్ని పెంచుకోవడానికి పంటకు సహాయపడతాయని, ఆఖరి రెండు దశలు దిగుబడి సామర్థ్యాన్ని అందిస్తాయని రైతులకు వివరించారు. వరిలో దోమ పోటు పంట పునరుత్పత్తి పండే దశలు దిగుబడి తగ్గటానికి ప్రాధాన్య కారణం దోమపోటును అదుపు చేసేందుకు ఉత్తమ పరిష్కారమైన చెస్‌ని సింజెంటా ప్రవేశపెట్టిందన్నారు. చెస్ అనేది వినూత్నమైన టెక్నాలజీ పంట దిగుబడిని కాపాడేందుకు ఆఖరి 60 రోజులలో చాలా ముఖ్యపాత్ర పోషిస్తుంది చెస్ గురించి మరింతగా అర్థమయ్యే రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కంపెనీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్‌కు సహకరించాలి : డిఎం

ప్రజాశక్తి-కావలి

కావలి డిపోలో ప్రయివేట్ వాహనాల తాకిడిని తట్టుకోవడం కోసం కావలి బస్టాండ్ ఎదురుగా స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ఆదివారం నుండి ప్రారంభించా మని కావలి ఆర్.టి.సి డిపో మేనేజర్ ఆర్.శ్రీనివాసులు ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంపై అన్ని యూనియన్ల ప్రతినిధులతో చర్చించడం జరిగిందన్నారు. డిపో ఆదాయాన్ని ప్రయివేటు వాహనాలు కొల్లగొట్టకుండా చేసే ప్రయత్నంలో ప్రతిఒక్కరూ కూడా యూనియన్ విభేదాలు విస్మరించి, కార్యక్రమంలో పాల్గొని,సంస్థ ఆదాయాన్ని పెంచటం కోసం కృషి చేస్తారని ఆ దిశలో అందరం ఒకరికొకరు సహకరించుకోవాలని కోరారు. కావున అన్ని యూనియన్ల ప్రతినిధులు వారి వారి సభ్యులతో ఉదయం 5 నుండి 8 గంటల వరకు తిరిగి సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు కావలి బస్ స్టేషన్ ముందు ప్రయివేటు వాహనాలను, ఆటోలను అడ్డుకొని కావలిడిపో బస్సు రెవెన్యూను పెంచడానికి ప్రతిఒక్కరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

బట్టేపాడులో నూతన గోడౌన్ ప్రారంభం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

గోడౌన్ ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి

వ్యవసాయంలో రైతులందరికీ లాభాలు చేకూరేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దృష్టి సారించారని ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆత్మకూరు మండలం బట్టేపాడు గ్రామంలో కోఆపరేటివ్ సొసైటీ బ్యాంక్ గోడౌన్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి జిల్లా కోపరేటివ్ బ్యాంక్ రీజనల్ మేనేజర్, చల్లా శంకర్ బాబు, బట్టేపాడు సొసైటీ చైర్మన్ లక్ష్మీరెడ్డి, ఆత్మకూరు సిండికేట్ ఫార్మర్స్ సొసైటీ నాగులపాటి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆత్మకూరు మున్సిపల్ వైస్ చైర్మన్లు డాక్టర్ శ్రావణ్ కుమార్, షేక్ సర్దార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఐ.వి.రమణారెడ్డి ఇతర వైసిపి నేతలు కార్యకర్తలు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఎరువులు విత్తనాలు సకాలంలో అందేందుకు గ్రామీణ ప్రాంతంలో ఇటువంటి గోడౌన్‌లు ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ముఖ్యమంత్రి 175 సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేసిన అంశంపై విక్రమ్‌రెడ్డి, అలాగే నవరత్నాల మేనిఫెస్టోతో ప్రభుత్వం పరీక్ష రాసిందని అందుకు 175 మార్కులు రావడం ఖాయం అంటూ ముఖ్యమంత్రి ప్రస్తావించిన 175 సీట్లను విద్యార్థుల మార్కులతో పోల్చి చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై ఏదో రూపాన వివాదాస్పదం చేస్తూ కోర్టులకు వెళుతూ ప్రభుత్వ పనులకు అడ్డం పడుతూ కాలయాపన చేయడం ప్రతిపక్షాలకు పరిపాటిగా మారిందని విమర్శించారు. సచివాలయం వ్యవస్థ ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాలు నేరుగా అందుతున్నాయని గడపగడపకు కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటి సమస్య ప్రభుత్వానికి తెలుస్తున్నాయని ఎంఎల్‌ఎ విక్రమ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు నోటి వినయ్ కుమార్ రెడ్డి, పెమ్మసాని శ్రీనివాసులు నాయుడు, చిల్లూరు వెంకటేశ్వర్లు, గడ్డం శ్రీనివాసులు పాల్గొన్నారు.

అంజాద్ అలీని సత్కరిస్తున్న ఐ.ఎం.ఎ. సభ్యులు

ఐఎంఎ క్విజ్ పోటీలు

ప్రజాశక్తి-కావలి : స్థానిక శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలోని డాక్టర్ "ఎల్లాప్రగడ సుబ్బారావు వైజ్ఞానిక ప్రాంగణంలో కావలి ఐఎంఎ ఆధ్వర్యంలో ఆదివారం 19వ సంచిక క్విజ్ పోటీలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ సతీష్, కార్యదర్శి పి.శ్రీధర్, మాధవి లత, క్విజ్ చైర్మన్ డాక్టర్ కె. గంగాధర్ రెడ్డి, కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీరాం మనోహర్ బాబు, గౌరవ సలహాదారులు డాక్టర్ బెజవాడ రవికుమార్ ఐఎంఎ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనపరిచిన ఉపాధ్యాయుడు కె.ఎస్. అంజాద్ అలీ, తన ప్రాస మాటలతో విద్యార్థులను ఉత్తేజ పరిచిన గణిత ఉపాధ్యాయులు మహేష్‌లను ఘనంగా సత్కరించారు.

అడ్డగోలుగా ఇటుక బట్టీలకు అనుమతులు

ప్రజాశక్తి-అల్లూరు

మండలంలోని నార్త్ ఆములూరు గ్రామంలోని ఇటుక బట్టీలకు రెవెన్యూ అధికారులు అడ్డగోలుగా అనుమతులిచ్చి అందిన కాడికి దోచుకుంటున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాలను నిర్వీర్యం చేసి యథేచ్ఛగా ఇటుక బట్టీలు ఏర్పాటు చేసి లక్షల రూపాయలు సొమ్ము చేసుకునే వ్యాపారాలకు కొమ్ము కాస్తూ ఇబ్బడిముబ్బడిగా అన్ని అనుమతులు ఎలా ఇస్తానని కొందరు ప్రశ్నిస్తున్నారు. ప్రధానంగా ఎస్‌సి, ఎస్‌టి కాలనీలను ఆసరాగా చేసుకుని సుదూర ప్రాంతాల నుండి లాంగ్ బ్యారెల్తో విద్యుత్‌ను భారీగా దుర్వినియోగం చేస్తున్నారు. కాగా కళ్ల ముందే విద్యుత్ చౌర్యమవుతుంటే ఆ శాఖకు సంబంధించిన అధికారులను ప్రశ్నిస్తే రెవెన్యూ అధికారులు అనుమతులు ఇచ్చారంటూ ఆగ్రహంతో సమాధానం ఇస్తున్నారని చెబుతున్నారన్నారు. కంచే చేను మేసింది అనే చందాగా ప్రభుత్వ అధికారులు ఇలాంటి దుర్మార్గాలు పాల్పడుతున్నారని గ్రామస్తులు తెలిపారు. వీరిపై ఎలాంటి ఫిర్యాదు చేసినా ఫలితం లేదని అంటున్నారు. ప్రధానంగా ఎస్‌సి కాలనీలో ఆ ప్రాంతవాసులను భయాందోళనకు గురిచేసి అడ్డగోలుగా దూర ప్రాంతాలకు విద్యుత్తును సరఫరా చేస్తున్నారు. అలాగే స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఎన్ఒసి సర్టిఫికెట్లను మంజూరు చేయడం సబబు కాదని వారన్నారు. ఈ కారణంగా పగలు, రాత్రి సమయాలలో మా గ్రామానికి విద్యుత్ లేకపోయినా చేసేదేమీ లేక విన్న కుండి పోతున్నామని బోరున విలపిస్తున్నారు. ప్రధాన రహదారిలో ఇటుక బట్టీ నిర్మాణాలకు అధికారులు ఏ విధంగా అనుమతులు ఇచ్చారో తెలియజేయాలని కోరుతున్నారు. ఇటుక బట్టీల యజమానుల నుండి సంబంధిత శాఖ అధికారులు భారి స్థాయిలో ముడుపులు స్వీకరించి చేతివాటానికి పాల్పడ్డట్టు సమాచారం. విద్యుత్ శాఖ అధికారులు ఆ గ్రామంలో ఎన్నడూ లేని విధంగా ప్రత్యేక శ్రద్ధ చూపడంతో గ్రామస్తులు ఆగ్రహవేశాలు వ్యక్త పరుస్తున్నారు. పంట పొలాలలో వ్యాపారస్తులు దర్జాగా ఇటుకలను కాల్చి సొమ్ము చేసుకుంటున్నారని వారిపై ఇంతవరకు ఎలాంటి చర్యలు లేకపోవడం సిగ్గుచేటన్నారు. కళ్ల ముందే ఇలాంటి దుర్మార్గాలకు పాల్పడుతున్నా కళ్లు లేని కబోదిలా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంతో అనేక అనుమానాలకు తావిస్తోందని అనేకమంది విమర్శిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.